

ఖాతా నుంచి రూ. లక్ష మాయం

తూప్రాన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్‌లో వచ్చిన ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ చేయగా బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్ష మాయం చేసిన ఘటన తూప్రాన్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్‌కు చెందిన కొక్కొండ శ్రీధర్‌రెడ్డి మొబైల్ ఫోన్‌లో వాట్సాప్ ద్వారా సైబర్ నేరగాళ్లు ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ చేశారు. ఈ నెల 19న రాత్రి బ్యాంకు ఖాతా నుంచి రెండు విడతల్లో రూ.లక్ష వేరే ఖాతాకు మళ్లించుకున్నారు. బాధితుడు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

సింగూరుకు తగ్గిన వరద.. నాలుగు గేట్లు మూసివేత



పుల్‌కల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు వరద తగ్గుముఖ పట్టడంతో ఒక గేటు మాత్రమే తెరిచి నీటిని కిందికి వదులుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఐదు గేట్లు తెరిచి ఉంచిన అధికారులు సాయంత్రానికి వరద తగ్గుముఖం పట్టడంతో 6, 8, 9, 10 క్రస్ట్ గేట్లను మూసేశారు. ప్రస్తుతం 11వ నంబర్ క్రస్ట్ గేట్‌ను మాత్రమే 1.5 మీటరు ఎత్తు నీటికి దిగువకు వదులుతున్నారు. రాత్రి 7 గంటలకు అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులోకి 13,315 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. క్రస్ట్ గేట్ ద్వారా 7,085 క్యూసెక్కులు, జల విద్యుత్ విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్ల ద్వారా 2,277 క్యూసెక్కులు మొత్తం 9,902 క్యూసెక్కులు ఔట్ ఫ్లో నమోదయింది. ప్రాజెక్టు ఆనకట్ట రివిట్‌మెంట్ కుంగిపోయి బలహీనపడటంతో రాష్ట్ర ఆనకట్ట భద్రత సంస్థ ఇచ్చిన నివేదిక మేరకు నీటి నిల్వలను 16 టీఎంసీలకు కుదించారు. పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.640 టీఎంసీల నీటి నిల్వలున్నాయి.

యాసంగికి సాగునీరు లేనట్లే

సింగూరు ప్రాజెక్టు అంతర్భాగంలో ఎడమ వైపు ఆనకట్ట కుంగిపోయి బలహీన పడినట్లు గుర్తించడంతో పూర్తి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయడం లేదు. దీంతో వచ్చే యాసంగి సీజన్‌కు సాగునీటిని విడుదల చేయడానికి అవకాశం లేకుండా పోయింది. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ప్రజల తాగునీటి అవసరాల దృష్ట్యా ప్రాజెక్టు కుడి, ఎడమ వైపుల మిషన్ భగీరథ పథకం నీటి శుద్ధి కేంద్రాలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించనున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌ను మొదలుకుని గడిచిన రెండు సీజన్లలో సింగూరు జలాలను సాగుకు విడుదల చేయలేదు. కాలువల ఆధునీకరణ పేరుతో రెండు సీజన్లలో చుక్క నీరు పారలేదు.

సంగారెడ్డి ప్రజలకు మంజీరా నీటి సరఫరాపై

కలెక్టర్‌తో జగ్గారెడ్డి, నిర్మల సమీక్ష

- ఫిల్టర్ బెడ్ నిర్వహణ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించాలని సూచన
- గతంలో మంజీరా వాటర్ స్కీమ్‌ను తానే మంజూరు చేయించానన్న జగ్గారెడ్డి
- సమీక్షలో పాల్గొన్న అదనపు కలెక్టర్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులు



జిల్లా కలెక్టర్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జగ్గారెడ్డి, నిర్మల

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ప్రజలకు మంజీరా నీటి సరఫరా కోసం కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీరు సక్రమంగా ఫిల్టర్ కాకపోవడంతో కలుషితమవుతున్నాయన్నారు. ఫిల్టర్‌బెడ్ నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగిస్తే బాగుంటుందని కలెక్టర్‌ను కోరారు. తాను ఎమ్మెల్యే కాకముందు సంగారెడ్డిలో లోతైన నల్లా గుంతల నుంచి నీరు తీసుకునేవారని గుర్తు చేశారు. 2004లో తాను ఎమ్మెల్యేగా గెలవగానే అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి సహకారంతో పట్టణానికి మంజీర నీటి పథకాన్ని మంజూరు చేయించానన్నారు. తానే స్వయంగా డిజైన్ చేసి మంజీరా నీటి పథకాన్ని ప్రారంభించానని వివరించారు. ఫిల్టర్ బెడ్ నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించాలన్న ప్రతిపాదనను సమ్మతించిన కలెక్టర్ ఇందుకోసం ఏడాదికోసారి టెండర్లు పిలవాలని, నెలవారీగా చెల్లింపులు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాజంపేట నుంచి హౌస్టల్‌గడ్డ వరకు సీసీరోడ్డు, ఫిల్టర్‌బెడ్‌లో సీసీరోడ్డు, రెస్ట్‌రూమ్ నిర్మాణానికి రూ. 2 కోట్లు మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి ఖర్చు చేయాలని నిర్ణయించారు. రూ. 500 కోట్లతో మహబూబ్‌సాగర్ సుందరీకరణ పనులకు ఫైనాన్స్ నుంచి అనుమతి వచ్చిందని, త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందని జగ్గారెడ్డి వివరించారు. ఈ చెరువు సుందరీకరణ పనులపై హెచ్ఎండీఏ అధికారులతో సెప్టెంబర్ 2న కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు.



సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్యతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి, నిర్మల



రామాయంపేటలో పద్మారెడ్డి తనిఖీ

అదే బారులు.. అవే బాధలు

యూరియా కోసం అవస్థలు

నిజాంపేట, చౌటకూర్‌లో లైన్లు

7

భద్రతే ప్రధాన లక్ష్యం

ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రో షా ఖాన్

7



గజ్వేల్ డిపో పరిశీలిస్తున్న ఈడీ

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు,

పోలీసుల అనుమతి ప్రక్రియ

నిబంధనలు పాటించాలి

డీజే వినియోగంపై నిషేధం

7



పేదల స్థలాల్లో రియల్ దందా

అక్రమాలకు అడ్డాగా మారిన కంది లక్ష్మీనగర్ కాలనీ

జోరుగా ప్రభుత్వం కేటాయించిన స్థలాల క్రయవిక్రయాలు

ఉన్నతాధికారులు స్పందించాలి



నిరుపేదలు, దివ్యాంగులకు కేటాయించిన లక్ష్మీనగర్ కాలనీ ఇప్పుడు ధనవంతులు, రియల్టర్లకు అడ్డాగా మారింది. నకిలీ సర్టిఫికెట్లతో రోజురోజుకు పుట్టగొడుగుల్లా నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సర్వే నంబర్ 615లో సర్వే చేపట్టి నిగ్గుతేల్చాలి.

-జుబేదా బేగం, దివ్యాంగుల హక్కుల రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు

విచారణ జరిపిస్తాం

ప్రభుత్వ భూమిలో ఉన్న కంలోని లక్ష్మీనగర్ కాలనీ నిరుపేదలు, దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. సర్వే జరిపించి ప్రభుత్వం కేటాయించిన స్థలానికి మించి ఆక్రమణలు జరిగినట్లు గుర్తిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. నకిలీ సర్టిఫికెట్లపై విచారణ జరిపిస్తాం.

-రవికుమార్, కంది తహసీల్దార్



పంచాయతీ అనుమతి పొందిన నకిలీ డాక్యుమెంట్

కంది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని కందిలో పేదల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాలు రియల్టర్లకు అడ్డాగా మారాయి. పేదలు, దివ్యాంగులకు కేటాయించిన స్థలాలను అక్రమంగా కొనుగోలు చేసి బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం 200 సంవత్సరంలో సర్వే నంబర్ 615లో ఐదెకరాల్లో పేదలు, దివ్యాంగులకు నివాస స్థలాలు పంపిణీ చేసింది. అనంతరం ఆ కాలనీకి లక్ష్మీనగర్‌గా నామకరణం చేసి ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు.

యథేచ్ఛగా క్రయవిక్రయాలు

కంది-శంకర్‌పల్లి హైవే పక్కనే లక్ష్మీనగర్ కాలనీ ఉండటం, కిలోమీటర్ దూరంలో ఐఐటీ హైదరాబాద్ రావడంతో ఈ ప్రాంతంలో భూముల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో రియల్టర్లు ఇక్కడ తిష్ట వేసి అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలాలను అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరం. అయినా కొందరు వ్యాపారులు నకిలీ పట్టాలతో యథేచ్ఛగా స్థలాల క్రయవిక్రయాలు చేపడుతున్నారు. ఇందుకోసం పేదలు, దివ్యాంగులను ఇళ్లు ఖాళీ చేసి వెళ్లాలని కొందరు బెదిరిస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. చాలా మంది భయపడి తక్కువ ధరకే తమ ఇళ్లను అమ్ముకుని వెళ్ళిపోయారని దివ్యాంగుల హక్కుల రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జుబేదా బేగం తెలిపారు.

అధికారుల సహకారంపై ఆరోపణలు

కొందరు పంచాయతీ, రెవెన్యూ అధికారుల సహకారంతోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలున్నాయి. 90 గజాల చొప్పున కేటాయించిన స్థలాలు రెండు మూడు కొనుగోలు చేసి, 130 గజాల నుంచి 250 గజాల ప్లాట్ల చొప్పున మార్చి విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇందులో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. వీటికి ఇంటి నంబర్లను సైతం కేటాయిస్తున్నారు. ఇందుకోసం కొందరు అధికారులు, సిబ్బంది రూ. లక్షల్లో ముడుపులు తీసుకుంటున్నారని విమర్శలున్నాయి. నకిలీ డాక్యుమెంట్ల ఆధారంగా ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

భవిష్యత్ కోసం మొక్కలు నాటాలి

మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



వనమహోత్సవంలో మొక్కలు నాటిన మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో 18వేల మొక్కలు నాటాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్నకుమార్, సుభాష్‌చంద్రబోస్, రంగానాథ్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పోలీసు వాహనాల స్టోర్ ఆధునికీకరణ



వాహన స్టోర్‌రూమ్‌ను ప్రారంభిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఇటీవల ఆధునీకరించి రిజర్వు ఇన్‌స్పెక్టర్ స్టోర్, మోటార్ వెహికల్ స్టోర్‌లను ఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం ప్రారంభించారు. గతంలో ఉన్న స్టోర్‌రూమ్‌లు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆధునికరించినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ఉపయోగించే కిట్లు, టెంట్లు, క్రీడాసామగ్రిని కొత్త స్టోర్‌లో భద్రపరుస్తారని తెలిపారు. మోటార్ వెహికల్ స్టోర్‌ను ఆధునీకరించి పూర్తిస్థాయి వర్క్‌షాప్‌గా తీర్చిదిద్దినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఆర్ఐలు రామారావు, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సంగారెడ్డి జీజీహెచ్‌లో క్యాన్సర్ వార్డు

25న ప్రారంభం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తించి చికిత్స అందించడం కోసం ప్రభుత్వం బోధనాస్పత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నది. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పది పడకలతో ప్రత్యేక క్యాన్సర్ చికిత్స వార్డును నెలకొల్పారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇటీవలే ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్టు రివాల్వింగ్ ఫండ్ కింద రూ.5 లక్షలతో పాలియేటివ్ కేర్ వార్డును ఆధునీకరించి జిల్లా క్యాన్సర్ చికిత్స వార్డును ఏర్పాటు చేశారు. మే నెలలోనే ప్రారంభించాల్సి ఉన్నా వాయిదా పడింది. తాజాగా ఈ నెల 25న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని డీఎంఈ నుంచి ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఆదేశాలు అందాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించనున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

విద్య, వైద్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం

- టూరిస్ట్ హబ్‌గా సింగూరు ప్రాజెక్టు
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



తక్కడపల్లి వద్ద బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్

మునిపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. 'పనుల జాతర-2025' కార్యక్రమంలో భాగంగా మునిపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో రూ. 70కోట్లతో చేపట్టిన పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్‌గా మార్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. సింగూరు ప్రాజెక్టు మధ్యలో ఉన్న దీవిలో రిసార్ట్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో సింగూరు బ్యాక్‌వాటర్ సమీప గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఆధ్వర్యంలో రిసార్ట్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. బుదేరా నుంచి సిరూర్ మధ్య ఒక రోడ్డు, సింగితం నుంచి కోడూర్ వరకు మరో రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే సింగూరు బ్యాక్‌వాటర్ గ్రామాలు టూరిస్ట్ స్పాట్‌గా మారుతాయన్నారు. బుదేరా గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను ఆదర్శంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఇటీవల భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంల పదోన్నతి...

మెదక్ జిల్లాలో తొమ్మిది మందికే అవకాశం

మెదక్ అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల్లో మెదక్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మల్టీజోన్-1 ప్రాతిపాదికగా గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టుల ప్రమోషన్లు చేపట్టడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. గెజిటెడ్ హెడ్‌మాస్టర్లుగా పదోన్నతుల్లో జిల్లాకు 23 మంది కేటాయించబడ్డారు. వారిలో జిల్లాకు చెందినవా తొమ్మిది మంది మాత్రమే ఉండగా.. 14 మంది ఇతర జిల్లాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. మల్టీజోన్-1లో ఎక్కువగా ఖమ్మం, హన్మంకొండ జిల్లాకు చెందిన వారే సీనియారిటీలో ముందుండడంతో జిల్లా ఉపాధ్యాయులు నష్టం జరిగింది. పదోన్నతులు పొందినవారిలో 21 మంది జీహెచ్ఎంలు శుక్రవారం విధుల్లో చేరినట్లు జిల్లా అధికారులు పేర్కొన్నారు.

చదువుకున్న పాఠశాలకే హెచ్ఎం



ఎడ్ల సుకన్య

మెదక్ అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తాను విద్యాబుద్దులు నేర్చుకున్న పాఠశాలలకే హెచ్ఎంగా నియమితురాలవగా ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. మెదక్ మండల పరిధిలోని ర్యాలమడుగు గ్రామానికి చెందిన ఎడ్ల సుకన్య మాచవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదివుకున్నారు. ప్రస్తుతం హావేళీఘణపూర్ మండలం కూచన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతిలో భాగంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలుగా మాచవరంలో పోస్టింగ్ పొందగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

ఎస్జీటీల సీనియారిటీ జాబితాపై కసరత్తు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ సజావుగా కొనసాగుతున్నది. గురువారం రాత్రి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు పూర్తయిన విషయం తెలిసిందే. సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈమేరకు ఎస్జీటీల సీనియారిటీ జాబితా రూపకల్పన, ఎస్ఏల ఖాళీలపై కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 25న వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించారు. 26న ఎస్జీటీల పదోన్నతి ఉత్తర్వులు వెలువడనున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 267 ఎస్ఏ పోస్టులు ఖాళీ ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

రూ. 20.60 కోట్లతో జిల్లాలో 'పనుల జాతర'

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



వెంకటరత్నాపూర్‌లో 'పనుల జాతర'ను ప్రారంభించిన మెదక్ కలెక్టర్

తూప్రాన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసమే ప్రభుత్వం 'పనుల జాతర-2025' కార్యక్రమం చేపట్టిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్, వెంకటరత్నాపూర్ గ్రామాల్లో శుక్రవారం పనుల జాతర కార్యక్రమాన్ని డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్యతో కలిసి ప్రారంభించారు. పంచాయతీ అవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటారు. అనంతరం అధికారులు సమన్వయంతో పనిచేసి పనుల జాతరను విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 492 గ్రామ పంచాయతీల్లో రూ.20.60 కోట్లతో 3,238 పనులు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం ఉపాధిహామీ పథకంలో ఎక్కువ పని దినాలు పూర్తిచేసిన కుటుంబాలను, పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అంతకుముందు వెంకటరత్నాపూర్‌లో నానో యూరియా పిచికారీని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో సతీష్, ఏపీవో సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలి దురుసు ప్రవర్తనపై విచారణ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్‌వో

జోగిపేట రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జోగిపేట ఏరియా ఆస్పత్రికి వచ్చిన గర్భిణితో వైద్యురాలు దురుసుగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలపై శుక్రవారం డీసీహెచ్ఎస్‌వో విచారణ చేపట్టారు. జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన తనతో గైనకాలజిస్టు దురుసుగా ప్రవర్తించారని ఓ గర్భిణి, కుటుంబ సభ్యులు గురువారం డీసీహెచ్ఎస్‌వోకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త సంగారెడ్డి విచారణ చేపట్టారు. ఆసుపత్రి సిబ్బంది, వైద్యురాలిని విచారించారు. వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

నకిలీ తేనె తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

గజ్వేల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నకిలీ తేనెను తయారు చేస్తున్న వ్యక్తిని గజ్వేల్ పోలీసులు, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌లోని ఈస్ట్ చంపారన్‌కు చెందిన మన్సూర్ ఆలం(33) ప్రజ్ఞాపూర్‌లోని ఒక ఇంటిని కిరాయికి తీసుకుని, నకిలీ తేనెను తయారు చేస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు గురువారం దాడులు నిర్వహించి 20 కిలోల మిక్సింగ్ తేనె, పటిక, చక్కెర, చిన్న గ్యాస్ సిలిండర్, స్టవ్, వడపోత వస్త్రం, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు గజ్వేల్ ఎస్సై రఘుపతి తెలిపారు.




నిందితుడిని పట్టుకున్న పోలీసులు











5.402 కిలోల గంజాయి పట్టివేత



ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

సంగారెడ్డిక్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణ శివారులోని 65వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎండు గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యజ్ఞల చిరంజీవి టాటా విస్టా కారులో ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. అతడి నుంచి 5.402 కిలోల ఎండు గంజాయి, కారు, ఒక మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు హనుమంతు, అనసుదీప్, సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుళ్లు పండరి, అరుణ జ్యోతి, సుభాష్, శివ, రాజేష్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు పట్టివేత

మునిపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న రూ.2.40లక్షల విలువ చేసే వివిధ రకాల మాదక ద్రవ్యాలను మునిపల్లి మండలం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా అవుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి షహనవాజ్ ఖాసిం ఆదేశాల మేరకు మెదక్ సహాయ కమిషనర్ జి.శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సును తనిఖీ చేయగా అందులో ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి వద్ద ఎన్‌డీపీఎస్ పదార్థాలైన చరస్ 108 గ్రాములు, ఎండిఎంఏ 2.90 గ్రాములు, ఎల్ఎస్ డీ పేపర్స్ 10, బ్లాట్స్, కొకైన్ 3.01 గ్రాములు, ఎండీఎంఏ ఎక్టసీ మాత్రలు 44 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. ఈ పదార్థాలను స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గాంధీనాయక్, ఎస్ఐ యాదయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



భాస్కర్ (ఫైల్)

అక్కన్నపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పంచరాయి తండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన భూక్య ఈర్య-బుజ్జి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహమైంది. భూక్య భాస్కర్ (18) ఇటీవలే ఐటీఐ పూర్తి చేసి కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ వద్ద ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా కరీంనగర్‌లో స్తంభంపై వైర్లు సరిచేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై కిందపడిపోయాడు. చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు.

రేగోడులో ఎద్దు ..

రేగోడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రేగోడులో రైతు నాగరాజు గౌడ్‌కు చెందిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దీని విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.





వేర్వేరు ఘటనల్లో ఆరుగురి ఆత్మహత్య

జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, పొలం గొడవలు తదితర కారణాలతో బలవన్మరణం పొందారు.



స్వామి, గంగమణి(ఫైల్)

నిజాంపేట ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇరువురు బలవన్మరణానికి పాల్పడ్డారు. నిజాంపేట ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం... నందిగామ గ్రామానికి చెందిన ఎడపల్లి స్వామి (40)భార్య గీత డబ్బుల విషయంలో రెండేళ్ల క్రితం గొడవపడ్డారు. దీంతో భార్య రామాయంపేటలో పిల్లలతో కలిసి ఉంటుండగా.. అతను రంగనాయక సాగర్ డ్యాం చంద్లాపూర్‌లో ప్రైవేట్ సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పిల్లలపై బెంగతో మనస్థాపానికి గురై గురువారం అర్ధరాత్రి తన ఇంట్లో దులానికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన వేల్పుల గంగమని (50) కుటుంబంలో గొడవలు, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక శుక్రవారం కల్వకుంట శివారులోని మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడింది. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

అప్పులు తీర్చే మార్గం లేక..



ఆంజనేయులు (ఫైల్)

మాసాయిపేట ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామం చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన తిరుపతి ఆంజనేయులు(49) ఇంటి నిర్మాణం కోసం అప్పు చేశాడు. వీటిని ఎలా తీర్చాలో తెలియక బుధవారం ఉదయం పోతనపల్లి అటవీ ప్రాంతం సమీపంలోని తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆంజనేయులు కుమారుడి ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జిన్నారంలో కార్మికుడు..

జిన్నారం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో స్టోన్ క్రషర్ వద్ద పని చేసే కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాధారం శివారులోని స్టోన్ క్రషర్ వద్ద పని చేసే కార్మికుడు సానీకుమార్ పానిక(24) గురువారం రాత్రి తాను పని చేసే స్టోన్ క్రషర్ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు మధ్యప్రదేశ్‌కు చెందిన వాడు కాగా, ఏడాది క్రితం వివాహం జరిగింది. మృతుడి సోదరుడు సచిన్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్‌రెడ్డి తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు ..



రాజేందర్(ఫైల్)

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో హుస్నాబాద్ మండలం మడద గ్రామానికి చెందిన ఆకుల రాజేందర్ (38) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతను రెండు రోజుల క్రితం తన భార్య పిల్లలను అత్తగారింటి వద్ద వదిలి తన స్వగ్రామం వచ్చి అదే రోజు వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శుక్రవారం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. రాజేందర్ గతంలో ఫోటో స్టూడియోలో పనిచేసి, తర్వాత కారు కొని అప్పులు తీర్చలేక ట్యాక్సీ డ్రైవర్‌గా మారాడు. అప్పుల బాధతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పురుగుల మందు తాగిన మహిళ..



యాదమ్మ(ఫైల్)

వర్గల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం మైలారం గ్రామానికి చెందిన పిట్ల యాదమ్మ (53) పురుగుల మందు సేవించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... యాదమ్మ, ఆమె కుమారుడు నరేష్ నివసించే ఇంటి సమీపంలో కొంత భూమి కొనుగోలు చేశారు. ఈ విషయంపై కుటుంబంలో గొడవలు చోటు చేసుకున్నాయి. గురువారం సాయంత్రం జరిగిన గొడవతో మనస్తాపం చెందిన యాదమ్మ బాత్‌రూంలోకి వెళ్లి పురుగుల మందు సేవించింది. చికిత్స కోసం గజ్వేల్, ఆపై హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా, మృతి చెందింది. నరేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తమ్ముడిపై అన్న కత్తితో దాడి



గాయపడిన షేక్‌బాబా

పటాన్‌చెరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో అన్నదమ్ములిద్దరూ గొడవ పడుతున్న సమయంలో తమ్ముడికి కత్తిపోట్లు పడి గాయపడిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... రుద్రారం గ్రామానికి చెందిన షేక్ మదర్, షేక్ బాబా అన్నదమ్ములు. గురువారం రాత్రి కుటుంబ గొడవల నేపథ్యంలో తమ్ముడు షేక్ బాబాపై అన్న షేక్ మదర్ కత్తితో దాడి చేశాడు. ఛాతీ భాగంలో గాయాలు కావడంతో ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. భార్య సమరీన్‌భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సిలిండర్‌కు మంటలు.. తప్పిన పెను ప్రమాదం



సిలిండర్‌లను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నారాయణఖేడ్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాయపల్లి రోడ్డు పక్కన ఉన్న ఒక టిఫిన్ సెంటర్‌లో శుక్రవారం సిలిండర్‌కు మంటలు అంటుకొని అగ్నిప్రమాదం జరిగింది. ఇవరాలు ఇలా ఉన్నాయి. ఉదయం పూట టిఫిన్ సెంటర్‌లో జనాలు టిఫిన్ చేస్తుండగా, వెనుక భాగంలో ఉన్న వంటగదిలో సిలిండర్‌కు మంటలు అంటుకున్నాయి. గదిలో 10 వరకు సిలిండర్లు ఉన్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకొని ఒకవైపు మంటలను ఆర్పుతూనే మరోపక్క గదిలో ఉన్న సిలిండర్లను బయటకు తీసుకొచ్చారు. జాతీయ రహదారి పక్కన నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగింది.



పాపన్నపేట పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న ఎస్ఐ, సిబ్బంది

వారు నాటుతున్నారు.. వీరు నరుకుతున్నారు

పాపన్నపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పోలీసులు మొక్కలు నాటుతుంటే, విద్యుత్ శాఖ మాత్రం కరెంటు అంతరాయం లేకుండా చెట్లను నరికివేస్తోంది. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి మొక్కలు నాటుతుంటే, విద్యుత్ శాఖ అధికారులు తీగల కింద పెరిగిన చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికి పడేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. నరికిన చెట్ల కొమ్మలను రోడ్ల మీదే వదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో పోలీసులు మొక్కలు నాటుతుంటే, కొత్తపల్లి వద్ద విద్యుత్ అధికారులు చెట్లు నరికారు. ఇష్టమొచ్చినట్లు మొక్కలు నరకడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా, వన మహోత్సవంలో భాగంగా పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటిన పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, పర్యావరణాన్ని కాపాడటం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.



కొత్తపల్లి గ్రామంలో విద్యుత్ అధికారులు నరికిన చెట్లు

మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లో షార్ట్ సర్క్యూట్

● ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీకాంత్

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లోని మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లో ప్యానల్ బోర్డు మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ముగ్గురు సిబ్బంది గాయపడ్డారు. బొల్లి పవన్, ఆపరేటర్ రాజేందర్‌లకు స్వల్ప గాయాలు కాగా, ఎడపెల్లి శ్రీకాంత్‌కు రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గత మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో సిబ్బంది మరమ్మతులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. శ్రీకాంత్‌ను మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పంప్‌హౌస్‌లో చాలా ఏళ్లుగా విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉన్నాయని, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రిడ్‌లో సమస్యలలను సంబంధిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చినా, నిర్లక్ష్యం వహించడంతో సమస్య నేడు ప్రాణాపాయంగా మారిందని గ్రామస్థులు మండిపడ్డారు. సంఘటన స్థలాన్ని మిషన్‌భగీరథ సీఈఈ అమరేందర్, ఎస్ఈ రాంప్రసాద్, డీఈఈ శ్రీనివాస్, ఏఈ సాయికృష్ణ పరిశీలించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని గ్రామస్థులు ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు స్పందించి బాదితులకు మెరుగైన వైద్యం అందించే బాధ్యత మాదని భరోసా ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

జాతీయ రహదారిపై అదుపు తప్పిన కారు

●త్రుటిలో తప్పిన ప్రమాదం



అదుపు తప్పి ఓ పక్కకు ఒరిగిన కారు

కంది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మదీనాగూడ-సంగారెడ్డి 65వ జాతీయ రహదారి విస్తరణ పనులు వాహనదారులకు ఆటంకంగా మారాయి. ప్రమాదాల సూచికల బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో దారి పొడవున రోజుకు ఒక ప్రమాదం జరుగుతునే ఉన్న హైవే అథారిటీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. శుక్రవారం కంది శివారులోని సంగమేశ్వర ఆలయం వద్ద బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో సూచికల బోర్డు కనపడక హైదారాబాద్ నుంచి జహీరాబాద్‌కు వైపుకు వెళ్తున్న ఓ కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టింది. బ్యాలెన్స్ తప్పి పక్కనే గుంతలో ఒరిగింది. ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్‌కు స్వల్ప గాయలవ్వగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. వెంటనే హైవే అథారిటీ అధికారులు స్పందించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా ప్రమాదాల సూచికబోర్డులు ఏర్పాటు చేసి, రోడ్లు విస్తరణ పనులు జరపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డే వేడుకల్లో విద్యార్థినులు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో గురు, శుక్రవారాలలో 'సెలెస్టియా-2025' పేరిట ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. కొత్త విద్యార్థులకు మరపురాని ప్రారంభాన్నిచ్చిన ఈ వేడుకలో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మిస్టర్ అండ్ మిసెస్ ఫ్రెషర్ కిరీట ధారణతో కార్యక్రమం ముగిసింది. వీరిని రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, ఆతిథ్యం క్యాంపస్ లైఫ్ విభాగం డైరెక్టర్ అంబికా ఫిలిప్ సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా చేరేవారు తమను తాము వ్యక్తీకరించుకోవడానికి, గీతం కమ్యూనిటీలో సభ్యులు కావడం అంటే, ఇంట్లో ఉన్నట్టుగా భావించేలా ఒక శక్తివంతమైన వేదికను సృష్టించడంలో విద్యార్థి నిర్వాహకులు చేసిన కృషిని ప్రశంసించారు.

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

● రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి
● ఆన్‌లైన్ అనుమతుల జారీ
● నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
● డీజే వినియోగంపై నిషేధం

దౌల్తాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో, మండలాల్లో గణేశ్ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతి తప్పనిసరి తీసుకోవాలని దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు. గణేశ్ నవరాత్రుల సందర్భంగా ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంలగాణ పోలీసు శాఖ నుంచి మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

నిబంధనలివే..

- గణేశ్ మండప నిర్వాహకులు పోలీసు అనుమతి కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసు కోవాలి. గణేశ్ ప్రతిమ ఎత్తు, మండపం ప్రదేశం. నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర వివరాలతో తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇంకా అవసరమైన అన్నీ వివరాలు పొందుపర్చాలి.
- రిజిస్ట్రేషన్ అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు ఆన్‌లైన్ అనుమతులు జారీ చేస్తారు. అనుమతి పత్రం, క్యూఆర్ కోడ్, పోలీస్ సూచనలు మండపం వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా ప్రదర్శించాలి.
- డీజే వినియోగంపై నిషేధం ఉందని గమనించాలి.
- విద్యుత్ కనెక్షన్ సంబంధించి ఆ శాఖ అనుమతి తీసుకోవాలి.
- మండపం వద్ద ఫ్లెక్సీల్లో కమిటీ సభ్యుల పేర్లు, బాధ్యత వహించే వారి నంబర్లు ఉంచాలి.
- నిమజ్జన సమయంలో ప్రతి ప్రతిమకు సరిపడ మంది సభ్యులు వెంట ఉండాలి. నిబంధనలు పాటించాలి.
- శబ్ద కాలుష్యం నివారణలో భాగంగా కేవలం రెండు స్పీకర్లు మాత్రమే ఉపయోగించాలి.
- వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా శబ్ద పరికరాలు పరిమితంగా వాడాలి.
- మండపంలో ప్రతీరోజు ఒక వలంటీర్ తప్పనిసరిగా ఉండాలి.
- అగ్నిప్రమాద నివారణ చర్యగా నీటి బకెట్లు, ఇసుక బస్తాలు తప్పనిసరిగా ఉంచాలి.

మట్టి విగ్రహాలను వాడుదాం..

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌కు మట్టి వినాయక విగ్రహాన్ని అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణాన్ని కాపాడుదామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పిలుపునిచ్చారు. ఆయనకు హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడే బాధ్యత అందరిపై ఉన్నదని, పర్యావరణ హితం కోసం హెల్పింగ్ హ్యాండ్ యూత్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. యువత ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అఖిల్, రాంజోష్, హనుమంత్ పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

గణేశ్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపు కోవాలి. పోలీసు శాఖ సూచించిన నిబంధనలను నిర్వాహకులు పాటించాలి. చట్ట విరుద్ధంగా అధిక శబ్ద పరికరాలను వాడొద్దు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- అరుణ్ కుమార్, ఎస్ఐ, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

● రాష్ట్ర విజిలెన్స్ చీఫ్ ఉమారాణి



చింతమడకలో సిబ్బందిని సన్మానిస్తున్న ఉమారాణి

సిద్దిపేట రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర విజిలెన్స్ చీఫ్ ఉమారాణి తెలిపారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో ఉపాధి హామీ పనుల జాతర కార్యక్రమంలో పాల్గొని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమారాణి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో పని చేసుకుంటూ వ్యవసాయానికి అనుబంధంగా ఉండే పనులను మంజూరు చేయించుకుని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ జిల్లా అధికారి గణేష్, జెడ్పీ సీఈవో రమేష్, ఎంపీడీవో మురళీధర్ శర్మ, ఎంపీవో విష్ణు, పంచాయితీ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిష్టిబొమ్మ దహనం



హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ పార్టీపై చేసిన ఆరోపణలను నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతులు గత నెల రోజులుగా యూరియా కోసం ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ప్రాంతానికి సరిపడా యూరియా ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు.

ప్రయాణికుల భద్రతే ప్రధాన లక్ష్యం

● ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రో షా ఖాన్




గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోను పరిశీలిస్తున్న ఈడీ

గజ్వేల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని టీజీ ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రో షా ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డిపో పరిధిలో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం డిపోలోని సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పనితీరును సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం కృష్ణమూర్తి, డీఎం పవన్, అసిస్టెంట్ డిపో మేనేజర్ బాబు నాయక్, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ జమీల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తునికిఖాల్సా పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు

● ట్రైల్ బ్లేజర్స్ పుస్తకంలో చోటు



ట్రైల్ బ్లేజర్స్ పుస్తకంలో ప్రచురితమైన ఉపాధ్యాయురాలు మంజులారెడ్డి

వర్గల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం తునికిఖాల్సా ప్రాథమిక పాఠశాలకు 2024-2025 సంవత్సరానికి గాను రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించిందని ప్రధానోపాధ్యాయుడు శ్యామ్ రాథోడ్ తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ (ఎస్‌సీఈఆర్‌టీ) ప్రచురించే 'ట్రైల్ బ్లేజర్స్' అనే పుస్తకంలో 'ప్రొఫెషనల్ జర్నీ' అనే టైటిల్‌తో తమ పాఠశాలకు చోటు దక్కడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో 51 పాఠశాలలను ఎంపిక చేశారని, విద్యార్థుల ప్రగతి, ఉపాధ్యాయుల పనితీరు, కమ్యూనిటీ ప్రోత్సాహం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారని ఆయన వివరించారు. తమ పాఠశాల ఉపాధ్యాయురాలు వంగ మంజులారెడ్డి బోధన, బోధనేతర కార్యక్రమాలు, విద్యార్థులు, తల్లిదండ్రులను ప్రోత్సహించిన తీరు, ఆమె జిల్లా రిసోర్స్ పర్సన్‌గా అందిస్తున్న సేవలను ఈ పుస్తకంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు మంజులారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పులి రాజు, విమల, రుక్మిణి శ్రీనివాస్, జరీనా, ఫరాహ పాల్గొన్నారు.

నిజాంపూర్(కె) పాఠశాల ఉపాధ్యాయులకు చోటు..



రామకృష్ణ, సునీత

సంగారెడ్డి అర్బన్/సదాశివపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : ఎస్‌సీఈఆర్‌టీ పుస్తకంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు చోటు లభించింది. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ తెలంగాణ, నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్‌షిప్(నీపా-న్యూఢిల్లీ) సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ లీడర్‌షిప్ అకాడమీపై ట్రైల్ బ్లేజర్స్ పేరుతో పుస్తకాన్ని ప్రచురించింది. ఇందులో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నిజాంపూర్ (కె) ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయురాలు సునీతలకు స్థానం దక్కింది. అకాడమిక్ డెవలప్‌మెంట్, ఎన్‌రోల్‌మెంట్ అండ్ అటెండెన్స్ విభాగంలో వీరు చోటు సంపాదించారు. ఎస్‌సీఈఆర్‌టీ ప్రచురించిన పుస్తకంలో తెలంగాణ నుంచి 51 మంది ఉపాధ్యాయులకు చోటు దక్కగా అందులో సంగారెడ్డి జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం దక్కడం విశేషం. ఈ సందర్భంగా వీరిని డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్‌ఎం, తదితర విద్యాశాఖ అధికారులు అభినందించారు.

సివిల్ ఇంజనీర్ రమ్యశ్రీకి జాతీయ అవార్డు



రమ్య శ్రీ

కొండపాక, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం సిరిసినగండ్ల గ్రామానికి చెందిన సివిల్ ఇంజనీర్ రమ్యశ్రీ నేషనల్ ఆర్కిటెక్చర్ ఇంటీరియర్ డిజైనర్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ అవార్డును ఆమెకు ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో డిజైనెస్ట్ ఇంటీరియర్ ఫౌండెడ్ కంపెనీని స్థాపించిన రమ్యశ్రీ, రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ విభాగంలో 'ట్రెండ్‌సెట్టర్, ప్రామిసింగ్ ఇంటీరియర్ డిజైనర్ ఫర్మ్ ఆఫ్ ది ఇయర్- 2025 తెలంగాణ అవార్డుకు ఎంపికయ్యారు.

సూర్యప్రకాష్‌రావుకు నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సూర్యప్రకాష్ రావు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో విశిష్ట నాయకత్వం విభాగంలో రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ అవార్డు-2025కి స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సూర్యప్రకాష్ రావు ఎంపికయ్యారు. విద్యారంగంలో గత 31 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించినందుకు గాను 'ఏక్ ఉపదేశ్ మీడియా' సంస్థ ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ అవార్డును హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం ప్రదానం చేశారు. కళాశాల అధ్యాపక బృందం, యాజమాన్యం అతడిని అభినందించింది. ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని సూర్యప్రకాష్‌రావు తెలిపారు.

అదే బారులు.. అవే బాధలు

● యూరియా కోసం రైతుల అవస్థలు



సుల్తాన్‌పూర్ హాకా సర్వీస్ కేంద్రంలో యూరియా కోసం ఎగబడుతున్న రైతులు



దుబ్బాక వ్యవసాయ సహకార సంఘం వద్ద బారులు తీరిన రైతులు

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతన్నలు తెల్లారింది మొదలు క్యూలలో నిలబడాల్సి వస్తోంది. దౌల్తాబాద్ మండలం రైతు వేదిక వద్ద టోకెన్ల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. గత వారం రోజులుగా తిరుగుతున్నా యూరియా దొరకడం గగనంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుబ్బాక వ్యవసాయ సహకార సంఘం ఎదుట 560 బస్తాల కోసం సుమారు 2 వేల మంది రైతులు తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాశారు. వ్యవసాయ అధికారి, ఎస్సై స్వయంగా దగ్గరుండి పంపిణీ చేయించారు. నిజాంపేట మండలం నస్కల్ గ్రామంలో రైతులు యూరియా కోసం గంటల తరబడి లైన్లో నిలబడ్డారు. చౌటకూర్ మండలం సుల్తానాపూర్‌లో కేవలం గంటలోపే 280 యూరియా బస్తాలు పంపిణీ అయిపోయాయి. తెల్లవారుజాము నుంచే క్యూ లైన్లలో నిలబడిన రైతులు బస్తాలు దక్కకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. మిరుదొడ్డి పీఏసీఎస్ కేంద్రం వద్ద రైతులు అర్ధరాత్రి నుంచే పడిగాపులు కాశారు. ఎకరానికి ఒక బస్తా మాత్రమే ఇస్తామని అధికారులు తెలపడంతో రైతుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపు చేశారు.

మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి తనిఖీలు..

రామాయంపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలతో కలిసి రామాయంపేటలోని ఒక ఫర్టిలైజర్ షాపుపై ఆకస్మిక దాడి చేసి, రైతులకు ఇవ్వకుండా దాచిన 50 యూరియా బస్తాలను పట్టుకున్నారు. వాటిని అక్కడి రైతులకు పంపిణీ చేయించారు. కొంతసేపు అక్కడే ఆందోళనకు దిగిన పద్మారెడ్డి, రైతులకు నేరుగా యూరియా ఇవ్వకుండా అవసరంలేని మందులు కొంటేనే బస్తాలు ఇస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. యూరియా సమస్య పరిష్కరించకపోతే మరో మూడు రోజుల్లో రామాయంపేటలో 'వంటావార్పు'తో పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ జితేందర్ గౌడ్, సొసైటీ ఛైర్మన్ బాదే చంద్రం తదితరులు పాల్గొన్నారు.



రామాయంపేటలో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి ధర్నా



నస్కల్‌లో ఎరువుల కోసం క్యూలో రైతులు

న్యూస్ బాక్స్

31 వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ విధానంలో పదవ తరగతి, ఇంటర్ కోర్సుల్లో అడ్మిషన్ పొందే వారు నిర్ణీత అపరాధ రుసుముతో ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం కల్పించినట్టు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం, ఆగస్టు, 22 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కాజీపల్లి ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. శుక్రవారం స్థానిక 181 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో ఆక్రమణల కోసం చేపట్టిన పలు బేస్‌మెంట్ నిర్మాణాలను ఆర్‌ఐ జయప్రకాశ్ నారాయణ, సిబ్బందితో కలిసి జేసీబీ ద్వారా కూల్చివేయించారు.

గడ్డపోతారంలో ఉచిత వైద్య శిబిరం

జిన్నారం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక న్యూలాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 340మంది స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, న్యూలాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు వరప్రసాదరావు, మధుబాబు, రాజేష్, యాదగిరి, డాక్టర్ కవిత, అడ్రియాన్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

జహీరాబాద్,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనుల్లో వేగం పెంచాలని గృహనిర్మాణశాఖ పీడీ చలపతిరావు పేర్కొన్నారు. శుక్రవారం మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లితండా, జాంగారీ బోలీతండా తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రమైన మొగుడంపల్లిలో ఎస్టీ బాలికల గురుకులపాఠశాలలో తనఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జిన్నారం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గుమ్మడిదల 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం శనివారం మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు జిన్నారం, సోలక్‌పల్లి, శివానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈలు రవీందర్, వెంకటేశ్వర్లు తెలిపారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి

జహీరాబాద్,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దైవదర్శనాలు, తదితర ప్రాంతాలకు ఉన్న టికెట్లపై 15% రాయితీని కల్పిస్తున్నామని జహీరాబాద్ డిపోమేనేజర్ స్వామి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూహైదరాబాద్-కర్నూల్, హైదరాబాద్-నంద్యాల, హైదరాబాద్-కడప, హైదరాబాద్-తిరుపతి, హైదరాబాద్-అనంతపూర్, హైదరాబాద్-ఒంగోలు, హైదరాబాద్-కందుకూర్ తదితర ప్రాంతాలకు రాయితీకల్పిస్తున్నట్లు వివరించారు.

గడ్డిమందు పిచికారి

కొల్చారం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కొల్చారం గ్రామప్రజల ఆరోగ్యమే తన ధ్యేయమని రాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు వెల్లి రాజు తెలిపారు శుక్రవారం గ్రామంలో అన్ని వార్డులలో దోమల గడ్డి మందు పిచికారి చేశారు



టేక్మాల్ తహసీల్ కార్యాలయం ఆవరణలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన చేస్తున్న డీపీవో యాదయ్య



కొల్చారం: పోతిరెడ్డిపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి కృష్ణవేణి



వెల్దుర్తి: ఎలుకపల్లిలో నిర్వహించిన పనుల జాతరలో అధికారులు

అట్టహాసంగా పనుల జాతర ప్రారంభం



కోహిర్ మండలం మద్రిలో పశువుల షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి తదితరులు



జహీరాబాద్: ఆనెగుంటలో పనులను ప్రారంభించిన సంగారెడ్డి జిల్లా పరిషత్ సీఈవో జానకిరెడ్డి, తదితరులు



నారాయణఖేడ్ మండలం మాధ్వార్‌లో నిర్వహించిన పనుల జాతరలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర కార్యక్రమాన్ని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అట్టహాసంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా శుక్రవారం రెండు జిల్లాల్లోని గ్రామాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ఆయా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగుపరిచేందుకు గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల ప్రహరీలు, సీసీ రోడ్ల నిర్మాణం, నూతన చెక్‌డ్యామ్‌లు తదితర పనులు చేపట్టారు. ఇవే కాకుండా ఉపాధి హామీ పథకంలో ప్రజలకు వ్యక్తిగత లబ్ధి చేకూర్చే పౌల్ట్రీ షెడ్లు, పశువుల పాకలు, ఇంకుడు గుంతలు కొత్తగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పనులను చేపట్టినట్లు సంబంధిత అధికారులు వివరించారు. పలుచోట్ల అధికారులు పారిశుధ్య కార్మికులను, ఉపాధికూలీలను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ఎమ్మెల్యేలు, స్థానిక సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి పనుల జాబితా సిద్ధం చేయండి



14వ వార్డులో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మెదక్ ఎమ్మెల్యే, కలెక్టర్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అసంపూర్తి పనులతో పాటు, నూతనంగా చేపట్టే అభివృద్ధి పనుల జాబితాను సిద్ధం చేసి ఇవ్వాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆదేశించారు. జిల్లా కేంద్రమైన మెదక్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి సుడిగాలి పర్యటన చేశారు. పట్టణంలోని 5, 9, 12, 14, 29, 30, 32 వార్డులలో పర్యటించి అభివృద్ధి పనులపై ఆరా తీశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ల ద్వారా వివరాలు సేకరించారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలు, నూతనంగా చేపట్టాల్సిన పనుల జాబితాను సిద్ధం చేసి ఇవ్వాలని కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. అత్యవసరంగా ఉన్నవాటికి ప్రాధాన్యత కల్పిస్తూ టీయూఎఫ్‌ఐడీసీ నిధులు కేటాయించాలని సూచించారు. ప్రతీ వార్డులో ఇంటింటికీ వెళ్తూ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్‌లో చిరువ్యాపారులు తైబజార్ వసూళ్లు అధికంగా వసూలు చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులపై మండిపడ్డారు. షాదీఖాన పనులను పూర్తి చేయాలని మైనార్టీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కాగా మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల కోసమై తాను నిధులు మంజూరు చేయిస్తుంటే మీరెందుకు పర్యవేక్షించడం లేదని మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎస్‌డీఎఫ్ నిధులు తీసుకురాగా, ప్రస్తుతం టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో పనులు వేగవంతంగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, నాయకులు దొంతి లక్ష్మి, లక్ష్మీనారాయణగౌడ్, మేడి మధుసూదన్‌రావ్, గోదల సాయి, తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు



రామచంద్రాపురం: ఎమ్మెల్సీ అంజిరెడ్డిని గృహనిర్బంధం చేసిన పోలీసులు



నర్సాపూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్‌ను అరెస్టు చేసిన పోలీసులు

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బచావో కార్యక్రమంలో భాగంగా బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సచివాలయం ముట్టడికి తరలివెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. ఈ మేరకు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఉదయం నుంచే పోలీసులు బీజేపీ నాయకులను అడ్డుకుంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. రామచంద్రాపురంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరిలను పోలీసులు అడ్డగించి నివాసంలోనే ఉంచి గృహనిర్బంధం చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నుంచి సచివాలయ ముట్టడికి తరలివెళ్లకుండా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్‌ను ముందస్తుగా అరెస్టు చేశారు. అదేవిధంగా సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్, జహీరాబాద్, నారాయణఖేడ్ మండలాల నుంచి, మెదక్ జిల్లాలోని చేగుంట నార్సింగి మండలాల నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా స్థానిక బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్ల కు తరలించారు.

నానో యూరియాతో అధిక దిగుబడి



కంది మండలం బేగంపేటలో నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకటలక్ష్మి

కంది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నానో యూరియాతో పంటలకు అధిక దిగుబడి వస్తుందని సంగారెడ్డి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ)వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌తో కలిసి బేగంపేట, కాశీపూర్‌లో ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా అక్కడి యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, ఇతర ఫర్టిలైజర్ల నిల్వలను, ఎరువుల అమ్మకాల స్టాక్‌బోర్డులు, రికార్డులను, పీవోఎస్ మిషన్‌లను పరిశీలించారు.ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాల్లో అక్రమంగా ఎరువుల నిల్వ చేసి, అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● **చేగుంట:** నానో యూరియా వాడడం వల్ల రైతులకు అనేక ప్రయోజనాలను ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం చేగుంట మండలం అనంతసాగర్‌లో రైతులకు క్షేత్రస్థాయిలో నానో యూరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మాధవి, భూపాల్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



తూప్రాన్‌లో పీస్ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

తూప్రాన్/పాపన్నపేట/చిన్నశంకరంపేట/టేక్మాల్/వెల్దుర్తి/నారాయణఖేడ్ ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో శుక్రవారం సీఐ రంగకృష్ణ ఆధ్వర్యంలో తూప్రాన్ సర్కిల్ స్థాయి పీస్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. వినాయక విగ్రహాల ఏర్పాటును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఇందువల్ల తగినవిధంగా భద్రతా చర్యలు తీసుకునే వీలుంటుదన్నారు. అలాగే, విద్యుత్ శాఖ అధికారులకు సైతం విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేసుకునే వీలుంటుందన్నారు. పాపన్నపేట మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశానికి మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ హాజరై మాట్లాడారు. మండలంలో గణేష్ ఉత్సవాలు, మిలాన్ ఉన్ నబీ వేడుకలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వినాయక మండపాల నిర్వాహకులకు మండలకేంద్రంలో ఎస్‌ఐ నారాయణగౌడ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించి భద్రత, ఇతర ఏర్పాట్లపై తగిన జాగ్రత్తలను సూచించారు. టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రాజేష్ ఆధ్వర్యంలో అన్ని మతాల పెద్దలు, వివిధ పార్టీల నాయకులతో పీస్‌కమిటీ సమావేశం నిర్వహించారు. నారాయణఖేడ్, వెల్దుర్తి మండలాల పరిధిలో ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు విద్యుత్‌శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఖేడ్ విద్యుత్ ఏడీఈ నాగిరెడ్డి, వెల్దుర్తి ఏఈ పెంట్యా నాయక్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.



తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న తండావాసులు

ఆకలయి తండాలో తీజ్ ఉత్సవాలు

నారాయణఖేడ్‌ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకలయితండాలో శుక్రవారం తీజ్ ఉత్సవాలు తండావాసులు ఘనంగా జరుపుకున్నారు. తండా నాయక్, కారోబారి, తండా పెద్దల సమక్షంలో తండాకు చెందిన యువతులు, మహిళలు సంప్రదాయ దుస్తులతో ఆలయాల్లో పూజలు ఆటపాటలతో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 28 వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు.

ప్రమాదకర గోతుల పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నారాయణఖేడ్‌లో రోడ్డుపై గుంతలను పూడ్చివేస్తున్న దృశ్యం

నారాయణఖేడ్ ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): 'అడుగుకో గుంత' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈ నెల 22న ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని శివాజీ కూడలి వద్ద రోడ్డుపై పెద్ద పెద్ద గోతులను ఎక్స్‌కవేటర్‌తో పూడ్చివేశారు. రాయిపల్లి రోడ్డులో పలుచోట్ల రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చివేసి, వర్షానికి రోడ్డుపై నిలిచిన ఇసుక, మట్టి తొలగించారు. ఆయా కాలనీల్లో దోమల నివారణకు రసాయనాన్ని పిచికారి చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఆక్సిజన్ పార్క్‌లో స్వచ్ఛ పనులు చేపట్టారు.

కల్హేర్‌లో ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడలు

కల్హేర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కల్హేర్ మండల పరిధిలోని క్రిష్ణాపూర్ ఉన్నత పాఠశాల మైదానంలో మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడలను ఎంఈవో శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బాగంగా మండల పరిధిలోని క్రిష్ణాపూర్, మార్డి, కల్హేర్, మాసాన్‌పల్లి, బీబీపేట గ్రామాలకు చెందిన జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీల్లో పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ క్రీడలపై సమీక్ష సమావేశం

చేగుంట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండల మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు ప్రశాంతంగా జరిగే విధంగా వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల విద్యాధికారి నీరజ పేర్కొన్నారు. శుక్రవారం చేగుంట మండల వనరుల కార్యాలయంలో వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చేగుంట ఆదర్శ పాఠశాలలో రెండు రోజులపాటు జరిగే క్రీడలకు సంబంధించి ఈ నెల 26న పాఠశాలల వారీగా క్రీడాకారుల వివరాలను చేగుంట జడ్పీహెచ్‌ఎస్ పీడీ శారదకు సంప్రదించాలన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీరుతోనే రైతులకు ఇబ్బందులు



నర్సాపూర్ పీఏసీఎస్ వద్ద రైతులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్

నర్సాపూర్,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ తీరు వల్లే రాష్ట్రంలో ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ విమర్శించారు. శుక్రవారం నర్సాపూర్ పీఏసీఎస్ వద్ద ఎరువుల కోసం వచ్చిన రైతులను ఆయన కలిసి మాట్లాడుతూ కేంద్రం సకాలంలో ఎరువులు అందించకున్నా రైతులు ఇబ్బందులను తొలగించడానికి ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఎరువుల ఇబ్బందులు రాకుండా చూడాలని కోరారు. కాగా స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డికి యూరియా కొరత పేరిట రాజకీయ లబ్ధి కోసం ధర్నా చేయడం తప్ప రైతులపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కచ్చితంగా రైతులకు సరిపడా యూరియా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

● **కొల్చారం:** కొల్చారం. యూరియా కొరతపై రైతులు అధైర్య పడొద్దని మండల వ్యవసాయ అధికారి శ్వేత తెలిపారు శుక్రవారం మండల కేంద్రమైన కొల్చారంలో రైతులకు యూరియా అందించామని తెలిపారు కొల్చారం గ్రామానికి ఒక లారీ రావడంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా టోకెన్లు ఇచ్చి సరఫరా చేశామన్నారు అలాగే మండలంలో అన్ని గ్రామాలకు యూరియా అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. రైతుల వద్దకు తహసీల్దార్ శ్రీనివాస్‌చారి వచ్చి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు

పిల్లల బాగోగులపై శ్రద్ధ పెట్టండి



శిశుగృహలో పిల్లల బాగోగులపై ఆరా తీస్తున్న సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని శిశు గృహలో పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి సౌజన్య నిర్వాహకులకు సూచించారు. సంగారెడ్డిలోని శిశు గృహ, సఖీ కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సఖీ కేంద్రంలోని పిల్లలు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. మంచి చదువులు చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని, ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆరోగ్య ఉప కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న మెదక్ జిల్లా వైద్యాధికారి

నిజాంపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి ఆస్పత్రి పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణుల వివరాలు నమోదు చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయ్యేలా చూడాలని తెలిపారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులకు సకాలంలో మందులు అందించాలని, డెంగ్యూ మలేరియా లాంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో రామారావు సిబ్బంది తదితరులు ఉన్నారు.

అక్రమాలపై డీఎల్‌పీవో విచారణ



దౌల్తాబాద్ గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టిన డీఎల్‌పీవో అనిత

హత్నూర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణం, నూతన ఇళ్ల నిర్మాణం అనుమతులపై వచ్చిన ఫిర్యాదుపై డీఎల్‌పీవో అనిత శుక్రవారం విచారణ చేపట్టారు. దౌల్తాబాద్ గ్రామానికి చెందిన పలువురు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో సీసీ రోడ్ల నిర్మాణం నూతన ఇళ్ల నిర్మాణం అనుమతులపై అవినీతి అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేశారు. దీంతో అధికారుల ఆదేశం మేరకు దౌల్తాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బహిరంగ విచారణ చేపట్టినట్లు డీఎల్‌పీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈవో యూసుఫ్, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి వెంకట్ నరసింహగౌడ్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

అంతర్జాతీయ స్థాయి సవాళ్లను ఎదుర్కోవాలి



ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభిస్తున్న జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు

పుల్‌కల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో సవాళ్లను ఎదుర్కోవాలని జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నెక్స్ట్ జనరేషన్ సైబర్ సెక్యూరిటీ ఇన్నోవేషన్ హబ్‌ను శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ పరిశోధన, నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ గుగులోత్ నరసింహ మాట్లాడుతూ ఈ హబ్ ద్వారా విద్యార్థులు పరిశోధనలతో పాటు స్టార్టప్‌లు, నైపుణ్య ఆధారిత అవకాశాల్లో రాణిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సైబర్వాల్ నెట్ సహకార సంస్థ సీఈవో ప్రసాద్ పాలేపు, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, హెచ్‌వోడీలు రజనీష్, జ్యోషి శ్రీపాద్, శైలజ, శాలిని, సునీత పాల్గొన్నారు.

విజ్ఞాన పాఠాలకు సంచార మొబైల్ వ్యాన్



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మొబైల్ సైన్స్‌లో ప్రయోగాత్మకంగా విజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

కొండాపూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రయోగాత్మకమైన విద్యను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరింత చేరువగా చేసేందుకు 250 ప్రయోగాల మొబైల్ సైన్స్‌ను జిల్లా యంత్రాగం అందుబాటులోకి తెచ్చింది. శుక్రవారం కొండాపూర్ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, గణితశాస్త్రం, సాంఘికశాస్త్రం లపై ప్రయోగత్మక విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు చదువుల వినోదంతో పాటు విజ్ఞానాన్ని నేర్చుకునే విధంగా విజ్ఞాన ప్రయోగశాల పనిచేస్తుందని ప్రధానోపాధ్యాయురాలు ఎలిజబెత్ పేర్కొన్నారు. నిపుణుల పర్యవేక్షణలో విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకునే అవకాశం విద్యార్థులకు కలుగుతుందన్నారు. విజ్ఞాన మొబైల్ నిపుణులు విఠల్‌నాయక్, భీంశకర్, భార్గవ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాబోధనపై నిరంతర శోధన చేయాలి

● **ఐసీఎస్‌ఎస్‌ఆర్ సంస్థ మాజీ డైరెక్టర్ ప్రొ.సుధాకర్ రెడ్డి**

మెదక్ అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యాబోధనపై నిరంతర శోధన చేయాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సంస్థ(ఐసీఎస్‌ఎస్‌ఆర్) మాజీ డైరెక్టర్ ప్రొ.సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. నేషనల్ సెమినార్లు పరిశోధకులకు నూతన మార్గ నిర్దేశనం చేస్తుందన్నారు. ప్రస్తుతం విద్యా విధానంలో వస్తున్న మార్పులకనుగుణంగా జాతీయ సదస్సు నిర్వహించడానికి తమ సంస్థ సహకారాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీఎస్‌ఎస్‌ఆర్ డైరెక్టర్ ప్రొ. పార్థసారథి, ప్రిన్సిపల్ డా. హుస్సేన్, అకాడిమిక్ కోఆర్డినేటర్ డా. శరత్‌రెడ్డి, అధ్యాపకులు డా. ప్రవీణ్‌కుమార్, డా. నాగేందర్‌రావు, డా. శ్రీలత, వెంకటేశ్వర్లు, డా. మల్లేశం, డా. రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

27న గణేష్ గడ్డ సిద్ధివినాయక ఆలయ బ్రహ్మోత్సవాలు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని ఈనెల 27వ తేదీ నుండి సెప్టెంబర్ ఆరవ తేదీ వరకు రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్ గడ్డ సిద్ధి వినాయక ఆలయంలో వినాయక చవితి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే నివాసంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి, పోస్టర్‌ను ఆవిష్కరించారు.